ఆటోవాలాల జీవనాధారానికి బ్రేకులు

- ఎన్నికల హామీని అమలు చేయని వైనం
- రూ.15 వేలు సాయం ఎక్కడ?
- బాడుగలు లేక ఆర్థిక ఇబ్బందులు


ఉపాధి లేక ఆటో స్టాండ్‌లో ఖాళీగా ఉన్న ఆటోలు

దెందులూరు: అధికారం కోసం బూటకపు హామీలు ఇవ్వడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటేనని ఆటో డ్రైవర్లు విమర్శిస్తున్నారు. ఏడాది క్రితం జరిగిన సమయంలో అన్ని వర్గాల ప్రజలు మాదిరిగానే తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో, ట్యాక్సీ లైసెన్స్ కలిగిన లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15వేలు ఆర్థిక సహాయం అందిస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రమాద, ఆరోగ్య బీమా కల్పిస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. ఎన్నికల సమయంలో కూటమి నేతలు దీనిపై విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే కూటమి సర్కార్‌అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. ఆటో డ్రైవర్లతో కూటమి సర్కారు ఆటలు మానుకొని ఇచ్చిన మాట ప్రకారం కనీసం ఆర్థిక సాయంమైనా అందించాలని డిమాండ్ చేస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో 2వేల మంది కార్మికులు ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. బస్సులు లేనప్పుడు ప్రయాణికులు ఆటోలపై ఆధారపడి గమ్యస్థానాలకు చేరుకుంటారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే ఆధారం.

తగ్గిన ఆదాయం...పెరిగిన ఖర్చులు..

ఆటో నిర్వహణకు సాధారణంగా ఖర్చులు ఉంటాయి. ప్రస్తుతం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ఆటో డ్రైవర్లు రోజంతా కష్టపడినా కనీసం రూ.200నుంచి రూ.300కూడా మిగలిని పరిస్థితి. దీనికితోడు కూటమి ప్రభుత్వం ఫ్రీ బస్సు ఏర్పాటు చేయడంతో మహిళలు ఎవ్వరూ ఆటోలో ప్రయాణించడం లేదని వాపోతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్ కేటాయించేది. అర్హులైన ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేలు వారి ఖాతాల్లో జమచేసేది. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10లక్షల బీమా అందించేవారు. అలాగే రవాణా వాహనం కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్‌కు రూ.3లక్షల వరకు వడ్డీ రాయితీ అందించి భరోసా కల్పించారు. దీంతో డ్రైవర్లు తమ కుటుంబసభ్యులకు ఇబ్బంది లేకుండా దర్జాగా ఉండేవారు. ప్రస్తుతం కూటమి సర్కార్ హయాంలో ఎలాంటి భరోసా లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

భారమైన కుటుంబ పోషణ



కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో ప్రస్తుతం కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండా ఉచిత బస్సు పథకం అమలు చేయడంతో ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డుపడ్డాయి. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం ఆదుకునేలా ప్రకటన చేయాలి. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రిలే దీక్షలు చేపడతాం.

– యేసు, దెందులూరు ఆటో యూనియన్ నాయకుడు

రూ.15 వేలు అందించాలి



రోజంతా కష్టపడి ఆటో నడిపినా కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులతో పాటు ఇంధన ధరలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ.15వేలు సాయం అందించాలి.

– పి.గోరి ఆటోడ్రైవరు, దెందులూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



ఆటోలకు ఆదాయం పూర్తిగా తగ్గిపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతుంది. ఆటోలకు నెలవారి వాయిదాలు కట్టాలంటే నిద్ర పట్టడం లేదు. ప్రభుత్వం సాయం అందించక ఉన్న ఆదాయాన్ని సైతం మరో రూపంలో తీసివేస్తే ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఎలా బతకాలి.

– గణపతి, ఆటో డ్రైవర్, దెందులూరు

క్లుప్తంగా

ఏసుక్రీస్తు బోధనలు అనుసరించాలి


వృద్ధులకు స్టాండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

దెందులూరు: బాధిత వృద్ధుల సేవ దేవుని సేవతో సమానమని ఆర్‌సీఎం దెందులూరు ప్యారిస్ ప్రీస్ట్ ఫాదర్ జి అమ్మన్ రాజా అన్నారు. గురువారం దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఆవరణలో వృద్ధులకు సపోర్టింగ్ స్టాండ్లు బియ్యం పంపిణీ చేశారు. దేవునియందు నమ్మక ఉంచి అనుదినం ప్రార్థించాలన్నారు. ఏసుక్రీస్తు బోధనలకు అనుగుణంగా జీవించాలన్నారు. అనంతరం బాధిత వృద్ధుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫాదర్ కల్యాణ్, ఉపదేశీయులు పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష పూజలు


స్వామి వార్లకు విశేష పూజలు చేస్తున్న పూజారులు

భీమడోలు: గుండుగొలనులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి జన్మనక్షత్రం శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో శుక్రవారం పాలాభిషేక పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ పూజారులు రామానుజ మంగపతి ఆచార్యులు, సాయి ఆచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి దివ్య రూపాన్ని దర్శించుకుని తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ వగ్వాల మీనా కుమారి, అచ్యుతరామారావు, పవన్‌కుమార్, ఈశ్వరి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడి ఉత్సవాలు


విశేష ఆలంకరణలో గణనాథుడు

భీమడోలు: మండలంలోని గణపతి సెంటర్‌లోని శ్రీమన్మహా గణనాథుని 61వ ఉత్సవాల్లో 10వ రోజు శుక్రవారం సాంప్రదాయ పండుమిరప వర్ణంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటి చైర్మన్ దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. పలు గ్రామాలకు చెందిన వినాయకుని విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి ఊరేగించారు. అనంతరం గోదావరి కాల్వలో నిమజ్జనం చేశారు.

వేడుకగా ముగింపు ఉత్సవాలు

నిడమర్రు : బువ్వనపల్లి రామాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలంలో రూ.16 వేలకు మానవత మండల అధ్యక్షుడు వన్నెంరెడ్డి పరమేశ్ దక్కించుకున్నారు.

ఘనంగా ఓనం పండుగ


ఓనం సందర్భంగా కేరళ సంప్రదాయ దుస్తుల్లో చిన్నారి

దెందులూరు: ఓనం పండుగ కేరళ రాష్ట్రంలో అతి పెద్ద పండుగ. సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని దెందులూరు సెయింట్ మెరిస్ యూపీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెచ్ఎం సిస్టర్ అన్నారు. శుక్రవారం ఓనం పండుగను కేరళ సిస్టర్లు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ఓనం అక్షరాలను ప్రతిబింబించేలా అలంకరణ చేశారు. అనంతరం కేరళ రాష్ట్ర సంప్రదాయ దుస్తులతో చిన్నారులు వేషధారణ చేశారు. ఓనం పండుగ విశిష్టతను వివరించి స్వీట్లు పంపిణీ చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ఏలూరు (టూటౌన్): హెచ్ఐవీ /ఎయిడ్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆదర్శ రూరల్ హెల్త్ అండ్ ఎకనమిక్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కె.శిరీష అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, ఆదర్శ రురల్ హెల్త్ అండ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు రైల్వే స్టేషన్ ఆటో స్టాండింగ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు ఎయిడ్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. శిరీష మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాప్తి, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చిన్న చూపు కుండా ఉండడం వంట పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ సంబంధిత పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూ ఎస్ రమాదేవి, గూడ్స్ షెడ్ ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీకి అనుమతులు లేవు


దెందులూరు ఎస్సై శివాజీ

దెందులూరు: బాణ సంచా తయారీకి ఎటువంటి అనుమతులు లేవని దెందులూరు ఎస్సై రాజమల్లు శివాజీ అన్నారు. గురువారం దెందులూరు పోలీస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని అన్ని ప్రాంతాల్లో బాణాసంచా దుకాణాలు గోడౌన్స్‌లో మెరుపు దాడులు చేయడం జరుగుతాయన్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాణ సంచా తయారీదారులు వ్యాపారులు ప్రభుత్వ అనుమతులతో నిబంధనలకు అనుగుణంగా పూర్తి జవాబుదారీతనంగా వ్యాపార లావాదేవీలు చేయాలన్నారు.

వేలంకిని మాత నవదిన పూజలు


వేలంకిని మాత నవదిన పూజల్లో పాల్గొన్న విశ్వాసులు

దెందులూరు: వేగవరం వేలంకిని ఆరోగ్యం మాత టవర్ వద్ద వేలంకని ఆరోగ్యమాత నవదిన పూజలు స్థానిక ప్యారిస్ పేస్ట్ ఫాదర్ ఎల్ మోజిస్ ఆధ్వర్యంలో జరిగాయి. వేగవరం గోపన్న పాలెంతో పాటు సమీప గ్రామ శివారు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విశ్వాసులు నవదిన పూజలో పాల్గొన్నారు. తొలుత వేలంకినీ ఆరోగ్య మాత చీర సమర్పణ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కోడూరుపాడులో నీటిలో నిల్వ ఉన్న కీటకాలను చూపుతున్న వైద్య సిబ్బంది

భీమడోలు: పరిసరాల పరిశుభ్రతతోనే కీటక జనిత వ్యాధులను నియంత్రించవచ్చునని పూళ్ల ఆరోగ్యవిస్తరణాధికారి వై.వీ లక్ష్మణరావు తెలిపారు. పూళ్ల పీహెచ్‌సీ పరిధిలోని కోడూరుపాడు, పూళ్ల సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. దోమల ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆయన క్షేత్రపరిశీలన చేశారు. ఇంటింటికీ వెళ్లి గృహ యాజమానులకు పలు సూచనలు చేశారు. దోమ పుట్టరాదు.. దోమకుట్టరాదు అనే నినాదంతో కీటక జనిత ప్రదేశాలను గుర్తించి, వాటిని నివారించడంపై అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా, పొడి వాతావరణం కలిగి ఉండాలని, తద్వారా వ్యాధులు దూరమవుతాయన్నారు. అవగాహనతో అప్రమత్తత కలిగి ఉన్నట్లయితే వ్యాధులు దరి చేరబోవమన్నారు. వర్షాల సీజన్‌లో దోమల వల్ల వ్యాపించే మలేరియా, మెదడువాపు, చికెన్‌గున్యా వంటి వ్యాధులను రక్షణ పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ జి.శ్రీనివాసరావు, కార్యకర్తలు రామాబాయ్, లలితాంబ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శాంతి, సామరస్యంతో వేడుకలు


ఉత్సవ కమిటీలతో సమావేశమైన అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అన్ని మతాల ప్రజలు శాంతి, సామరస్యంతో మెలుగుతూ తమ తమ పండుగలను భక్తిశ్రద్ధలతో, సంతోషంగా నిర్వహించుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు సూచించారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు వన్ టౌన్ సర్కిల్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహకులతో శుక్రవారం వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శాంతి సమన్వయ సమావేశం నిర్వహించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ వేడుకలు నిర్వహిస్తున్న రెండు వర్గాల నిర్వహకులు పోలీస్ శాఖ మార్గదర్శకాలను విధిగా పాటించాలని కోరారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా, ఇబ్బందులు సృష్టించకుండా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇతర మతాల ఆచారాలను గౌరవిస్తూ, మన భారతీయ సంస్కృతిని కీర్తిని మరింత గొప్పగా చాటుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే వ్యవహరిస్తే చట్టం మేరకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, ఎస్సై మదీనా బాషా, వేడుకల కమిటీల నిర్వాహకులు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి వితరణ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటులో జాప్యం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు పేర్కొన్నారు. రాజవరం గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన దుగ్గిరాల రామారావు కుటుంబానికి పార్టీ శ్రేణులతో కలిసి ఆయన రూ.20 వేలు సాయం అందించారు. దుర్గారావుతో పాటు అగ్ని ప్రమాద బాధితులైన తోటసాని సత్యనారాయణ దంపతులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోన గంగరాజు, కాకి నాగేశ్వరరావు, శ్రీరంగనిలయం విశ్వనాథ్, అనంతల సుబ్బారావు, ఆకుల తాతారావు, పాముల నాగమునిస్వామి, కుర్రి తాతబ్బాయి, దాసరి నాగరాజు, తమిర్చి వీర్రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి విరామం ఉండదు


గణపవరం లయన్స్‌క్లబ్ గురుపూజోత్సవంలో సత్కారం పొందిన గురువులు


పెదపాడు ఎమ్మార్సీ భవనంలో గురువులను సన్మానిస్తున్న మండల విద్యాశాఖాధికారులు

గణపవరం: ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి విశ్రాంతి, విరామం, పదవీ విరమణ అనేవి ఉండవని, జీవితకాలం వీరు విజ్ఞానాన్ని ప్రజలకు పంచుతూనే ఉండాలని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ అధ్యక్షుడు, జోనల్ చైర్మన్ ఈపూరి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సరిపల్లె లయన్స్‌క్లబ్ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గణపవరం, నిడమర్రు మండలాల్లో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా జరిగిన సభకు క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో ఈపూరి మాట్లాడుతూ సమాజంలో అజ్ఞానచీకట్లను తొలగించి, విజ్ఞాన కాంతులు వెలిగించే మహత్తర కార్యం ఉపాధ్యాయుల భుజస్కందాలపై ఉందన్నారు. గణపవరం, నిడమర్రు మండలాల ఎంఈవోలు గొర్రెల బాలయ్య, యర్రంశెట్టి శేషగిరిరావు మాట్లాడుతూ అవార్డులు మన బాధ్యతలను మరింత పెంచుతాయన్నారు. లయన్ రీజియన్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒకదేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చిత్తశుద్ధి, పనితీరుపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈసందర్భంగా విశ్రాంత ప్రిన్సిపల్స్ కె.సత్యనారాయణ, జి.లివింగ్‌స్టన్, బువ్వనపల్లి హైస్కూలు హెచ్ఎం సంకు ఏసుబాబు, ఉపాధ్యాయులు వానపల్లి శ్రీనివాస్(కాశిపాడు), వాసిరెడ్డి పావని(గణపవరం), కె.దుర్గాంబ(పిప్పర), జి.దేవదాసు (గణపవరం), సిహెచ్ సత్యసుధ(నిడమర్రు), బి.సత్యవాణి(అడవి కొలను), అడబాల అప్పారావు(నిడమర్రు), యర్రంశెట్టి వెంకటేశ్వరరావు(బువ్వనపల్లి)లను దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందచేశారు. ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి కిలారి రవి, లయన్స్ జోన్ చైర్మన్ రావూరి నాగరాజు, లయన్స్‌క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జిల్లా ఉత్తమ హెచ్ఎం ఆర్ శైలజ, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న జ్యోతి, రజని

ఘనంగా గురుపూజోత్స వేడుకలు

పెదపాడు: మండలంలో గురుపూజోత్స వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఏపూరు పాఠశాల ఉపాధ్యాయురాలు నక్కా సరళకుమారి, గుడిపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ముసునూరి రామకృష్ణ, వపంతవాడ ఏఎల్‌పేట ఉపాధ్యాయుడు కామా జయప్రకాష్, కలపర్రు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కర్రె కుమారి, జ్యోతి ఇంగ్లీషు మీడియం పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రత్తిపాటి పద్మావతి, వీరమ్మకుంట ఉపాధ్యాయురాలు మాగంటి వరవెంకట జయలక్ష్మి, కొత్తముప్పర్రు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు నాగవెంకట పద్మావతిని శాలువాలతోను, పూలమాలలతోను ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో వారికి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, జంగం నరేంద్ర, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యోతి, రజినిలకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

దెందులూరు: అంకితభావం ఏ రంగంలోనైనా గుర్తింపు తెస్తుందని ఏలూరు జిల్లా కామన్ బోర్డ్ ఎగ్జామ్స్ సెక్రటరీ సర్వేశ్వరరావు, అపుస్మ రాష్ట్ర అధ్యక్షుడు కే తులసి, విష్ణు ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఏలూరులో దెందులూరు నియోజకవర్గం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల పంపిణీ జరిగింది. దెందులూరు సెయింట్ మేరీస్ యూపీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు కొత్తపల్లి జ్యోతి, తోట రజినిలకు అవార్డులు ప్రశంసపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. దెందులూరు నియోజకవర్గం అపూస్మా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్ రాజు, కోశాధికారి జయరాజు, కార్యదర్శి తంబి సెయింట్ మేరీస్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఏలూరులో ఆనందకుమార్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

జిల్లా ఉత్తమ హెచ్ఎంగా ఆర్ శైలజ

పెదవేగి : జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలుగా దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్ శైలజ ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో హెచ్ఎం ఆర్ శైలజను జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. పాఠశాల నిర్వహణ, అన్ని విభాగాల్లో అగ్రగామిగా నిలిచి, జిల్లా ఉత్తమ హెచ్ఎంగా శైలజ ఎంపిక కావడంపై సర్వత్రా హర్షాతిరేకలు వ్యక్తమయ్యాయి. పాఠశాల సిబ్బంది, ఇతర ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఆనంద కుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ఉంగుటూరు: మండలంలోని కాగుపాడు మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు ఊట ఆనందకుమార్ డా.సర్వేపల్లి రాదాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అభించింది. ఏలూరు జేసి దాత్రి రెడ్డి చేతులు మీదుగా అవార్డు తీసుకోవడం జరిగింది.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ వారి వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉదయం శ్రీవారి మూలవరుల కు 108 కలశాలతో అభిషేకం చేశారు. చతుస్థానార్చనం, నిత్య హవనాలు నిర్వహించి, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పెదవేగి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీఐ సీహెచ్ రాజశేఖర్ తన సిబ్బందితో దాడి చేయగా సంఘటనా ప్రదేశంలో ఐదుగురు పేకాట రాయుళ్లు వారి వద్ద నుంచి రూ.9,450 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని సీఐ తెలిపారు.

ప్రభుత్వ విధానాలతో ఆత్మహత్యలు

ద్వారకాతిరుమల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలే రైతుల ఆత్మహత్యలకు కారణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ద్వారకాతిరుమల మండలం ఎం నాగులపల్లిలో కూరగాయల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ షెడ్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షుడు బోయపాటి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సంఘ మండల మహాసభలో శ్రీనివాస్ మాట్లాడారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రహదారులు


గొల్లగూడెం వద్ద పడిన గోతులు


కంకర పైకి లేచిన గోపినాథపట్నం-గొల్లగూడెం ఆర్‌అండ్ బీ రహదారి

- రహదారుల మరమ్మతుల పేరుతో కూటమి డ్రామా
- నిత్యం నరకం అనుభవిస్తున్న వాహనదారులు, ప్రయాణికులు


ఉంగుటూరు-నారాయణపురం మధ్య జాతీయ రహదారిపై పడిన గోతులు


గోతులమయంగా మారిన నల్లమాడు-దూబచర్ల రోడ్డు

ఉంగుటూరు: ఉంగుటూరు జాతీర రహదారులు నరకానికి నకళ్లగా మారాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచింది. గతంలో చిన్నపాటి గోతులపై తీవ్ర రాజకీయం చేసిన కూటమి నేతలు ఇప్పుడు వాటి విషయమై పట్టించుకోవడం లేదు. ఎన్నిసార్లు ప్రకటనలు చేసినా వారి తీరు మారడం లేదు. అయినా రహదారుల విషయంలో సరైన తీరులేదు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ప్రధానంగా రహదారుల తీరు మారుస్తాం. గుంతలు లేని నాణ్యమైన రోడ్లు వేస్తాం. అంటూ ప్రగల్భాలు పలికి నేడు వాటి విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా జాతీయ రహదారి తాడేపల్లిగూడెం మొదలుకుని భీమడోలు మండలం పూళ్ల వరకు పలు రహదారుల్లో గతం కన్నా మరింత గుంతలు పడి ఇబ్బందిగా తయారయ్యాయి. పలు ప్రాంతాలలో గోతులతో వాహచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల రాళ్లు పైకి లేచి ఉండటంతో నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే రహదారుల తీరు మారుతుందని అనుకొన్న ప్రజల కు నిరాశే మిగిలిందని ప్రత్యక్షంగా ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు నాణ్యతతో చేయాలని ప్రజలు కోరుతున్నారు.